క్లుప్తంగా

ఫుడ్ ప్రాసెసింగ్‌పై నేడు శిక్షణ

శ్రీకాళహస్తి: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ కార్యాలయంలో వారాహి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్పీఓ డైరెక్టర్లు, రైతులకు, యువతకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్, తొట్టంబేడు ఎఫ్‌పీసీ చైర్మన్ గుమ్మడిపూడి దశరదాచారి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గత యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెరుకు శ్రీహరి, కృష్ణయ్య, కుప్ప ప్రసాద్ కుమార్, జలగు శ్యాం సుందర్, జయచంద్ర పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీ నటుడు బాలాజీ



ఆలయం వద్ద సినీనటుడు బాలాజీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం ప్రముఖ సినీనటుడు బాలాజీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేశారు. నెమళ్లూరు బుజ్జి, అర్ముగం పాల్గొన్నారు.

బాలికలకు నేతల పరామర్శ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై, చికిత్స పొందుతున్న విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి పరామర్శించారు. ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా, నాయకులు నవీన్, చందు, చరణ్, సారథి తదితరులు పాల్గొన్నారు.

అమరలో వార్షిక వైద్యపరీక్షలు



వైద్యసేవలను ప్రారంభిస్తున్న డాక్టర్ రమాదేవి

రేణిగుంట: అమరరాజా గ్రూప్ తమ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు అమర హాస్పిటల్ సహాయంతో వార్షిక వైద్యపరీక్షల కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొరినేని రమాదేవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గొరినేని రమాదేవి మాట్లాడుతూ అమరరాజా ఎల్లప్పుడు ఉద్యోగుల ఆరోగ్య భద్రతను బాధ్యతగా తీసుకుంటుందన్నారు. అమర్ రాజా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. చంద్రబాబు, అమర రాజా చీఫ్ సస్టెయినబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రేణిగుంట: కుటుంబకలహాలతో గడ్డి మందు తాగి తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మునయ్య (42) మృతి చెందినట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం పంచాయతీ, డీపీ కండ్రిగలో నివాసం ఉంటున్న మునయ్య గత నెల 30వ తేదీ ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురై పొలాలకు వాడే గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫారమ్ పాండ్లు నిర్మించుకోవాలి



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: రైతుల పొలాల్లో ఫారమ్ పాండ్లు నిర్మించుకుని, నీటిని నిల్వ చేసుకోవాలని జిల్లా ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని పల్లమాల చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా పనులు చేస్తే రోజువారీ కూలీ కొలతల ప్రకారం రూ.300 వస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఉపాధి ఏపీఓ దేవరిలు ఉన్నారు.

రైళ్లలో ఈగల్ టీం తనిఖీలు



రైల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట: ఈగల్ టీమ్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా రేణిగుంట రైల్వేస్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌తోపాటు పళ్లు రైళ్లలో గురువారం తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరచారి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషన్ ఆర్పీఎఫ్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్ టీం సీఐలు ప్రసాద్, రవి నాయక్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. బ్యాగ్‌లను క్షుణ్ణంగా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు.

సేవలపై నిర్లక్ష్యపు నీడలు



పునాదుల దశలో ఆగిపోయిన నాగలాపురం సచివాలయం-2



కారిపాకంలో నిర్మాణ దశలో ఆగిపోయిన గ్రామ సచివాలయ భవనం

సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకందించడమే కాకుండా ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. సత్యవేడు నియోజకవర్గంలో చాలావరకు సచివాలయ భవనాలు పూర్తయి కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే కొన్నిచోట్ల మాత్రం ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. ఆయా భవనాల పూర్తిపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకోవడంతో లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది.

- అర్ధాంతరంగా ఆగిన సచివాలయ భవనాలు పూర్తయ్యేనా ?
- నాటి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై కూటమి ప్రభుత్వం కుట్రలు
- వృథా అవుతున్న ప్రజాధనం

వరదయ్యపాళెం: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించాలన్న గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మంచి చేస్తే .. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ లక్ష్యం నీరుగారుతోంది. దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన సచివాలయ వ్యవస్థ కూటమి ప్రభుత్వం వచ్చాక సేవలందించడంలో నిర్లక్ష్యానికి గురవుతోంది. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో గత ప్రభుత్వం 90 సచివాలయాలను ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం కోసం ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. అలాగే 90 సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాలను సైతం మంజూరు చేసింది. అయితే 42 గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాల నిర్మాణం పూర్తికావడంతో ఆ భవనాలను ప్రారంభింపజేసి సేవలను కొనసాగిస్తున్నారు. మిగిలిన 48 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. దీంతో గత ఏడాది సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో పనులు ఆగిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు అసంపూర్తిగా ఆగిపోయిన భవనాల గురించి ఏమాత్రం ఆలోచన చేయలేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణ దశలో ఆగిపోయిన భవనాల పరిస్థితి ఏమిటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజాధనం వృథా ..

లక్షల రూపాయలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టారు. అర్ధాంతరంగా ఆగిన భవనాలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసి వాడుకలోకి తేవాలి. నిర్మాణ దశలోనే వదిలి వేయడం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది. పాలకులు దీన్ని గుర్తించాలి.

–చిన్నిరాజ్,
సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

వాడుకలోకి తేవాలి..

లక్షల రూపాయల ప్రభుత్వ ధనాన్ని వినియోగించి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి. భవనాలను మూత వేసి ఉంచడం వల్ల ఉపయోగం లేదు. ప్రభుత్వాలు ఏవైనా కావచ్చు. ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనాలను పూర్తి చేయాలి. అభివృద్ధి పనుల్లో రాజకీయం చేయడం సరికాదు.

–దాసరి జనార్ధన్, సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్



కేవీబీపురం మండలంలో ఆగిపోయిన కండ్లూరు సచివాలయ భవనం

సత్యవేడు నియోజకవర్గంలో అర్ధాంతరంగా ఆగిన గ్రామ సచివాలయ భవనాల వివరాలు:

మండలం	సచివాలయాల పేరు
వరదయ్యపాళెం	కారిపాకం, వరదయ్యపాళెం-2
పిచ్చాటూరు	ఎస్‌ఎస్‌బీపేట, రామగిరి, పిచ్చాటూరు, వెంగళత్తూరు
సత్యవేడు	దాసుకుప్పం, ఆంబాకం, మదనంబేడు, సత్యవేడు-1, 2, 3, కాళమనాయుడుపేట, చిన్నఈటీపాకం, రాజగోపాలపురం, పీవీపురం, ఆరూరు
నాగలాపురం	బీరకుప్పం, కష్టాపురం, నాగలాపురం-2, నాగలాపురం-3, ఎస్‌ఎస్‌పురం, సురుటుపల్లి, టీపీకోట, వేంబాకం
కేవీబీపురం,	ఆదవరం, ఆరె, సూరమాల, కండ్లూరు, కోటమంగాపురం, కోవనూరు, ఎంఏరాజులకండ్రిగ, మిద్దికండ్రిగ, ఓళ్లూరు, పవనవారికండ్రిగ, ఎగువవపూడి, రాయపేడు, సదాశివపురం, తిమ్మసముద్రం
నారాయణవనం	తుంబూరు, నారాయణవనం-2,
బీఎస్‌కండ్రిగ	పుత్తేరి, కారణి, ఆలత్తూరు, వెస్ట్ వరత్తూరు, ఆర్‌అనంతాపురం





నిర్మాణ దశలో ఆగిపోయిన ఆర్ అనంతాపురం సచివాలయ భవనం, సత్యవేడులో శ్లాబు దశలో ఆగిన గ్రామ సచివాలయ భవనం

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో గురువారం ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమాన్ని చెన్నైకు చెందిన తిరువూరు విజయన్, వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయాధికారులు దర్శన ఏర్పాటు చేసి స్వామి ప్రసాదాలు అందించారు. ఆలయాధికారి సుబ్రమణ్యం, చెంగల్ రాయులు, అర్చకులు నాగరాజ భట్టాచార్యులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి అభిషేకం



విశేషాలంకరణలో అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వారాహి ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం వారాహి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస మిల్క్ డెయిరీ సంస్థ యాజమాన్యం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత పర్యవేక్షించారు.

ముక్కంటిసేవలో నిర్మాత గోపాల్‌రెడ్డి



ఆలయంలో గోపాల్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని గురువారం ప్రముఖ సినీ చాయాగ్రాహకుడు, నిర్మాత ఎస్ గోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. దక్షిణగోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రావణేశ్వరుడిపై పరాశరేశ్వరస్వామి



భక్తులను కటాక్షిస్తున్న నటరాజస్వామి



రావణేశ్వర వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు రావణేశ్వర వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం అలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలు పూర్తి చేసి, శివగామి సమేత నటరాజ స్వామి ఉత్సవం నిర్వహించారు. నటరాజ స్వామి తిరుచ్చి వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. అలయానికి చేరుకున్న నటరాజస్వామికి ఆస్థానం నిర్వహించారు. 11 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను, హోమాలు చేపట్టారు. అనంతరం పరమ భక్తుడైన రావణబ్రహ్మ వాహనంపై స్వామివారు అధిష్టించారు. సర్కారు హారతి అందుకున్న ఉత్సవర్లు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సైతం విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో కూటమి విఫలం

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజన్ అన్నారు. రేణిగుంట పంచాయతీ వడ్డిమిట్ట శాఖా మహాసభ గురువారం నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసీరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రమేష్, సునీల్, ఖాదర్ వల్లి, అవినాష్, కుమార్, చక్రి, జేవీ చలపతి పాల్గొన్నారు.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ యూనిట్‌కు స్థల పరిశీలన

ఏర్పేడు: కోబాక సమీపంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ తిరుపతి యూనిట్ ఏర్పాటు కోసం గురువారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినోద్ అగర్వాల్, వారి బృందం చేరుకుని స్థలాన్ని పరిశీలించారు. కోబాక రెవెన్యూ కుప్పయ్యకండ్రిగ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. వారివెంట శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ భార్గవి, డీటీ రోజారమణి, ఆర్ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

శ్రీకాళహస్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీసులు సూచించారు. గురువారం పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో దుకాణదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేసిన వాహనచోదకులను హెచ్చరించారు.


ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి



సమావేశమైన సీఐటీయూ నాయకులు

రేణిగుంట: ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు సెల్వరాజ్ డిమాండ్ చేశారు. రేణిగుంట సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆ యూనియన్ మండల విస్తృతస్థాయి సమావేశం సెల్వరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. ఈనెల 9వ తేదీన జరిగే సమ్మెను అందరూ జయప్రదం చేయాలని కోరారు. సమావేశం అనంతరం సమ్మె కరపత్రాలు, పోస్టర్లు ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు వెంకటరమణ, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ధనమ్మ, అంబికా, బిల్డింగ్ వర్కర్ల జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రవి మేస్త్రి, లారీ యూనియన్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, దస్తగిరి, ఆటో యూనియన్ నాయకురాలు దీప, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలే



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి: లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలేనని, పట్టణంలోని న్యాయస్థానంలో ఈనెల 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, అన్ని శాఖల అధికారులు సద్వినియోగం చేసుకోవాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. గురువారం పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ దేశవ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తారన్నారు. ఇందులో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, బ్యాంకు శాఖలకు సంబంధించి ప్రీలిటికేషన్ తదితర కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకుంటే అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే లోక్ అదాలత్‌లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ మెకానిక్ డే

శ్రీకాళహస్తి: పట్టణంలో గురువారం ఘనంగా వరల్డ్ మెకానిక్‌డే నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలో మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హాజరయ్యారు. మెకానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం స్కూటర్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

ద్రౌపదీదేవి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి గ్రామోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ద్రౌపదీ వస్త్రాపహరణం కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను చప్పరంపై అధిష్టించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

నేడు అర్జున తపస్సు

ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అర్జున తపస్సు, అర్ధరాత్రి 12 గంటలకు అలుగు, కుంభాగ్రం కార్యక్రమం జరుగుతుందన్నారు.

విద్యతోనే ఉన్నతి



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, మునిలక్ష్మి

తొట్టంబేడు: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విక్రమ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విక్రమ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సేవలో భాగంగా పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మునిలక్ష్మి, అధ్యాపకులు మల్లికార్జున్, సునీల్, రామకృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ విమల తదితరులు పాల్గొన్నారు.